


మంత్రి పొన్నం ప్రభాకర్


మంత్రి సీతక్క



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సర్కారు లక్ష్యాలు నెరవేర్చండి..

- ప్రజలు, ప్రభుత్వానికి వారధులు మీరే..
- నిర్లక్ష్యాన్ని ప్రదర్శించే అధికారులను ఉపేక్షించం
- అమల్లో ఉన్న ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయండి
- ఇరిగేషన్, పంచాయతీరాజ్ పనులు కీలకం
- ప్రాజెక్టులు, నిధులు, పూర్తిపై మరింత సమచారమివ్వాలి..
- ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి సమీక్షలో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి
- జిల్లాల వారీగా సుదీర్ఘంగా చర్చించిన పొంగులేటి

హనుమకొండ సిటీ, జనవరి 20: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నెరవేర్చాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉమ్మడి జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం ఆయన వరంగల్ జిల్లా పర్యటనకు వచ్చారు. హనుమకొండలోని కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాల అభివృద్ధి అంశంపై అంతర్గతంగా సమీక్ష జరిపారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ విప్ రాంచం ద్రునాయక్, ఎమ్మెల్యేలు మురళీనాయక్, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, యశస్వినీరెడ్డితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉదయం 11:30గం టలకు ఆరంభమైన సమీక్ష.. సాయంత్రం 5:15గంటల వరకు కొనసాగింది. ప్రతీ జిల్లాలోని నియోజకవర్గాల వారిగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష జరిపారు. అధికా రుల నుంచి నివేదికలు కోరారు. ఎమ్మెల్యేల ప్రతిపా దనలను మంత్రి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఆయా నియోజకవర్గాల అభివృద్ధి, ప్రజల సమస్యలు, పరిష్కా ర చర్యలు, నిధుల వ్యయం, కేటాయింపు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనలు సేకరించి వాటిని ఆచరణలో పెట్టే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఇరిగేషన్, పంచాయతీరాజ్ పనులే కీలకంగా..

వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులు, పంచాయతీరాజ్ పనులే కీలకంగా సమీక్ష జరిగింది. జిల్లాలోని వ్యవసాయ సాగు, తాగునీటి వనరులు, ఇరిగేషన్ ప్రాజెక్టుల వివరాలు, పూర్తయినవి, అమల్లో ఉన్నవి, ఇంకా ప్రారంభించని ప్రాజెక్టుల విషయాలను మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చర్చించారు. అదే విధంగా పంచాయతీరాజ్ శాఖ పనులును సమీక్షించారు. బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గాల వారిగా ప్రకటిం చిన ప్రాజెక్టులను అధికారుల నుంచి అడిగి తెలుసుకు న్నారు. ప్రకటించిన ప్రాజెక్టులు ఆచరణలోకి వచ్చా యా.. లేదా.. అసలే చేపట్టనివి ఎన్ని? ప్రారంభించి వదిలేసినవి ఎన్ని? అనే వివరాలను అధికారుల నుంచి సమగ్రంగా సేకరించి సమీక్ష జరిపారు. ప్రతీ నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికలు, నిధుల కేటా యింపు, నిర్దేశిత లక్ష్యాలు, అభివృద్ధి పనుల ముగింపు అంశాలపై అధికారులకు దిశా, నిర్దేశం చేశారు. ప్రజా పాలన అభయహస్తం గ్యారంటీల దరఖాస్తు లు, కంప్యూటరీకరణను చర్చించారు. రెండు పడక గదుల నిర్మాణం, పంపిణీ వివరాలను సమీక్షిం చారు. 12 నియోజకవర్గాల పెండింగ్ సమస్యల పరిష్కార చర్య లు చేపట్టాలని, అభయహస్తం హామీలను నెరవేర్చాల ని సూచించారు. అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని, ప్రజల సమస్యలు, అభివృద్ధి ఫలాలే పని తనానికి కొలమానమని స్పష్టం చేశారు.

జాతరను విజయవంతం చేద్దాం..

మేడారం జాతరను సమష్టిగా విజయవంతం చేద్దామని మంత్రి సీతక్క కోరారు. జాతర కోసం ప్రభుత్వం రూ.105కోట్లు కేటాయించిందని

మిగతా 7వ పేజీలో..

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

అభివృద్ధి సమావేశం కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌గా మారింది. బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల మధ్య జరిగిన సంభాషణ సమావేశాన్ని వేడెక్కించింది. కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి సమావేశంలో పాల్గొనడం, కమలాపూర్‌లో కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ, ప్రొటోకాల్ అంశాలు రగడకు కారణమయ్యాయి. జనగామ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తనకు ప్రొటోకాల్‌ను ఇవ్వడం లేదని, తన నియోజకవర్గంలో కూడా అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇవ్వాలని, ఎమ్మెల్యే కాని వారిని సమావేశంలో ఎలా ఉంటారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నించినట్లు తెలిసింది. ఇదే క్రమంలో తనకు తెలియకుండా కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ జరిగిందంటూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చెప్పడంతో మంత్రి పొన్నం ప్రభాకర్

మిగతా 7వ పేజీలో..

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి అధిక నిధులు

- మేడారం జాతరకు రూ.105కోట్లు
- ప్రజాభిప్రాయానికి అనుగుణంగా మాస్టర్‌ప్లాన్
- ప్రగతి భవన్ నిర్మాణానికి 8 నెలలు.. కాళోజీ కళాక్షేత్రానికి పదేళ్లా..?
- రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

7


కరుణాపురం వద్ద జంక్షన్, ఫ్లైఓవర్ నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

అభివృద్ధి పనులపై మంత్రి నజర్

- వివిధ ప్రాంతాలను సందర్శించిన మంత్రి పొంగులేటి

వరంగల్ నగర పర్యటనకు శని వారం వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నగరాభివృద్ధి ప్రణాళి కలు, పనులను పరిశీలించారు. కరుణాపురం వద్ద వరంగల్ వెళ్లే దారిలో జంక్షన్ నిర్మాణం, స్వాగత తోరణం, రింగ్ రోడ్డు బ్రిడ్జి మీదుగా హైదరాబాద్-హనుమ కొండ జాతీయ రహదారికి అను సంధానంగా ఫ్లైఓవర్ నిర్మాణం అంశాలను పరిశీలించారు.

వివరాలు : 7లో..


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏబీవీపీ నేతలు

ఫార్మసీలో డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలి

- కేయూ పరిపాలన భవనాన్ని ముట్టడించిన విద్యార్థులు
- వర్సిటీ పరీక్షల అధికారులు ఘెరావ్

కేయూ క్యాంపస్, జనవరి 20: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఫార్మసీ విద్యార్థులకు డిటెన్షన్ విధానాన్ని ఎత్తివే యాలని శనివారం కేయూ పరిపాలన భవనం ఎదుట విద్యార్థులు ఆందోళన చేపట్టారు. వర్సిటీ క్యాంపస్‌కు విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చి పరిపాలన భవనం ఎదుట బైఠాయించారు. వర్సిటీ అధికారుల తమకు న్యా యం చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద పెట్టున నినాదా లు చేశారు. వర్సిటీ అధికారుల తీరును నిరసించారు.

ఈ సందర్భంగా ఏబీవీపీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ సభ్యు డు మాచర్ల రాంబాబు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బందం ప్రణయ్‌లు మాట్లాడుతూ.. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు ఫార్మసీ విద్యార్థులకు పరీక్ష లు ముగిసిన వెంటనే ఇన్‌స్టంట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించకపోవడంతో చాలామంది విద్యార్థులు డిటెన్షన్ కు గురై విద్యకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆందోళనకు దిగడంతో కేయూ పరీక్షల నియంత్రణాకారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెషనల్స్ కోర్సుల అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రణయ్‌కుమార్ విద్యార్థుల వద్దకు వచ్చి సముదాయించేందుకు ప్రయత్నించారు. అయినా విద్యార్థులు వినిపించుకోకుండా ఘెరావ్ చేశా రు. తమకు డిటెన్షన్ విధానానాన్ని తొలగించాలని డిమాం డ్ చేశారు. పీసీఐ నిబంధనలను పాటించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందచేశారు. చివరకు విద్యార్థులిచ్చిన విన తి పత్రంలోని అంశాలను 5రోజులలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాల ని విద్యార్థులు కోరగా హామీ పత్రాన్ని అందచేశా రు. నిరసన ఆందోళన కార్యక్రమంలో కేయూ ఏబీవీపీ వర్సిటీ ప్రెసిడెంట్ కొక్కుల ప్రశాంత్, యూనివర్సిటీ సెక్రటరీ శ్రావణ్‌కుమార్‌తో పాటు కేయూ పరిధిలోని ఫార్మసీ అఫ్లియేటెడ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్లపై వివరాల సేకరణ

హనుమకొండ అర్బన్, జనవరి 20: ప్రజారోగ్య, కుటుం బ సంక్షేమ విభాగంలో వివిధ జిల్లాలతోపాటు డీహెచ్ కార్యాలయంలో డిప్యూటేషన్‌లు, వర్క్ ఆర్డర్లపై విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల వివరాలు వెంటనే పంపాలని రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్ ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వం వివి ధశాఖల్లో ఎంతమంది డిప్యూటేషన్‌లపై విధులు నిర్వర్తి స్తున్నారో వివరాలు సేకరించాలని ఆదేశించింది. ఈ ఉత్త ర్వుల మేరకు శాఖలో కూడా ఎంత మంది డిప్యూటేషన్‌ల పై విధులు నిర్వహిస్తున్నారో వివరాలు సేకరిస్తున్నారు. త్వరలో వీరందరినీ సొంత పోస్టింగులకు పంపనున్నట్లు విశ్వసనీయ సమాచారం.



నిట్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు రూపొందించిన ఆల్ టెర్రేయిన్ వాహనం

జోరుగా.. హుషారుగా..

- ఆకట్టుకున్న ఈవెంట్లు
- ఆలోచింపచేస్తున్న ఎగ్జిబిట్లు
- వివిధ అంశాలపై వర్క్‌షాపులు
- ప్రముఖుల ప్రసంగాలు
- సందడిగా రెండో రోజు టెక్నోజియాన్
- ఆవిష్కృతమైన మినీ భారతం

వరంగల్ నిట్ కళాశాలలో రెండోరోజు శనివారం టెక్నోజియాన్ (సాంకేతిక ఉత్సవం)-2024 జోరుగా హుషారుగా సాగింది. శుక్రవారం నిర్వహించిన ఈవెంట్లు రెండోరోజు కూడా కొనసాగాయి. వివిధ అంశాలకు సంబంధించి రూపొందించిన సుమారు మరో 40 కొత్త ఈవెంట్లు శనివారం జరిగాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నిట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు రూపకల్పన చేసిన ఈ ఈవెంట్లు సరికొత్త సాంకేతికతలను ఆవిష్కరించాయి. ఒక్కో ఈవెంట్ ఒక్కో ప్రత్యేకతను చాటాయి. సాంకేతిక ప్రపంచంలో ఎప్పటికప్పుడు చోటు చేసుకుంటున్న నూతన పోకడలను దృష్టిలో ఉంచుకొని వాటికి అనుగుణంగా వీటిని రూపొందించారు. దైనందిన జీవితంలో ప్రజల అవసరాలు, భవిష్యత్తులో ఎదురయ్యే నూతన సవాళ్లను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఈ ఈవెంట్లలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ ప్రతిభాపాఠవాలను చాటుకున్నారు.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)/ కాజీపేట

7

రాముడి పాలన అనుసరణీయం

- ప్రముఖ ధార్మిక ప్రవచకురాలు అనంతలక్ష్మి


హనుమకొండ కల్చరల్, జనవరి 20: ప్రస్తుతం దేశ మంతా రామమయం అయిందని, సోమవారం అయో ధ్యలో రామాలయ పునఃప్రతిష్ఠ కోసం అందరూ ఎదు రుచూస్తున్న క్రమంలో రామపాలన ప్రతీ ఒక్కరికి అనుసరణీయమని, ఆచరించదగినదని ప్రముఖ ధార్మి క ప్రవచకురాలు, బుల్లితెర ఫేమ్ డాక్టర్ నందివాడ అ నంతలక్ష్మీ అన్నారు. హనుమకొండలో ఏకశిలా వైభవ మండలి ఆధ్వర్యంలో నిర్వహించే రామాయణ సప్తా హం కార్యక్రమంలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన ఆమె శనివారం ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించి రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు.


ప్రసంగం చేస్తున్న అనంతలక్ష్మీ

అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మా ట్లాడుతూ.. రామరాజ్య స్థాపన జరిగి వందల ఏళ్లు గడిచినా రాముడి ఆదర్శాలు ప్రతీ ఒక్కరికి నిత్య నూతనమని ఆమె పేర్కొన్నారు. ప్రేమ, వాత్సల్యం, కరుణరసం, కోపం, ఆవేశం, ఆగ్రహం ఇలా మనిషి లోని అన్నిరకాల సుగుణాలకు, గుణాలకు రాముడు ఆదర్శమని, యావత్ రామాయణం చదివితే రాముడి గొప్పతనం తెలుస్తుందన్నారు. ఈరోజు అయోధ్య విష యంలో రాముడి ఘనత ప్రపంచానికి మరింత విస్తృత మైందని అన్నారు. సమాజంలో అయోధ్య నేపథ్యంలో ధార్మిక భావన కూడా ఎంతో పెంపొందుతోందని చె ప్పారు. హిందూత్వం కూడా మరింత బలోపేతం కానుందన్నారు. రామాయణం లాంటి ఇతిహాస పురా ణాల ద్వారా రామరాజ్య విశేషాలను తెలుసుకొని ప్రజ లు ప్రభావితం కావాలన్నారు. రామనామానికి ఎంతో గొప్ప శక్తి ఉందన్నారు. రాజరాజ్య స్థాపన ధర్మ ప్రచార విస్తృతికి అయోధ్య కేంద్ర బిందువు కావాలని ఆమె ఆకాంక్షించారు. జేడీ లక్ష్మీ నారాయణ స్థాపించిన పార్టీ కరీంనగర్ శాఖ అధ్యక్షురాలు కవిత తదితరులు ఆమె వెంట ఉన్నారు. అలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించి ఆమెతో ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఈవో వెంకటయ్య, వేద పండితుడు మణికంఠ శర్మ, పరిచారకుడు సందీప్‌శర్మ, మహిళా భక్తులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో సాంకేతికతే కీలకం

- సవాళ్లను అధిగమిస్తేనే విజయం
- టెక్నోజియాన్‌లో రెడ్ బస్ సీఈవో ప్రకాశ్ సంగం



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రకాశ్ సంగం

హనుమకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో సాంకేతికతే కీలకమని, ప్రస్తుత ప్రపంచంలో సాంకేతిక సాయం లేకుండా ముందుకు వెళ్లలేమని రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం అన్నారు. వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన అతిథి ప్రసంగం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ.. ముఖ్యంగా వ్యాపార రంగంలో సాంకేతికత కీలకభూమిక పోషిస్తుందన్నారు. సాంకేతికత జీవితాలను ఎలా మారుస్తుందో ఇంజనీర్లు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రతీ రంగంలో సవాళ్లు, సమస్యలు ఉంటాయని, వాటిని అర్థం చేసుకొని పరిష్కరించుకుంటూ వెళ్లడం తోనే విజయం సాధ్యం అవుతుందన్నారు. రెడ్ బస్ మార్కెట్‌లో పోటీని ఎలా ఎదుర్కొన్నది, వాటిని ఎలా అధిగమించింది సోదాహరణగా ఆయన వివరించారు. పట్టుదల, కృషి, నిబద్ధత, నిజాయితీలే ప్రతీ మనిషి విజయ శిఖరాలను అందుకోవడానికి నిచ్చెనమెట్లలాగా ఉపయోగపడతాయన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు తరగతి గదిలో తాము నేర్చుకున్నదే కాకుండా క్షేత్రస్థాయిలో దానిని ఆచరణాత్మకం చేయాలని అన్నారు. అప్పుడే మనం నేర్చుకున్న జ్ఞానానికి సార్థకత లభిస్తుందన్నారు. రెడ్ బస్ సీఈవోగా తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.

సాంకేతిక విజ్ఞానదాయిని

టెక్నోజియాన్

▸▸ విద్యార్థుల మనోభావాలు

ప్రతిష్ఠాత్మకమైన వరంగల్ నిట్ కళాశాలలో నిర్వహిస్తున్న టెక్నోజియాన్ విజ్ఞానదాయకంగానూ, స్ఫూర్తిమంతంగానూ ఉందని ఇందులో పాల్గొంటున్న పలువురు విద్యార్థులు అభిప్రాయపడ్డారు. టెక్నోజియాన్‌లో పాల్గొనడం తమ అదృష్టంగా పేర్కొన్నారు. ఎన్నో కొత్త విషయాలను నేర్చుకుంటున్నామని చెప్పారు. తమ ప్రతిభా పాఠవాలను ప్రదర్శించాలనుకునే ఇంజనీరింగ్ విద్యార్థులు ఇలాంటి టెక్నోఫెస్ట్‌లో తప్పకుండా పాల్గొనాలని అన్నారు. వారి మాటల్లోనే..

పాల్గొనడం ఇది మూడోసారి



మధురెడ్డి, బీటెక్ ఫైనల్ ఇయర్ (ట్రిపుల్ ఈ), గుంటూరు

వరంగల్ నిట్‌లో నిర్వహిస్తున్న టెక్నోజియాన్‌లో వరుసగా పాల్గొనడం ఇది మూడోసారి. హాజరైన ప్రతీసారి సాంకేతికంగా కొత్త విషయాలను నేర్చుకుంటున్నాను. సరికొత్తగా చోటుచేసుకుంటున్న సాంకేతిక ఆవిష్కరణలను అర్థం చేసుకోవడానికి, సాంకేతికంగా మన ఆలోచనలకు పదును పెట్టడానికి టెక్నోజియాన్ మంచి వేదిక.

కొత్త ఆలోచనలకు అంకురం టెక్నోజియాన్



దేవిశ్రీ, బీటెక్ ట్రిపుల్ ఈ, వైజాగ్

విద్యార్థులో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు, వినూత్న సాంకేతిక ఆవిష్కరణలకు సమష్టిగా కృషి చేయడానికి టెక్నోజియాన్ ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. విద్యార్థుల్లో వైజ్ఞానిక జిజ్ఞాసను పెంపొందించేందుకు టెక్నోజియాన్‌ను మించిన వేదిక మరొకటి లేదు. ఈ ఈవెంట్ టీమ్ లీడర్‌గా తాను ఈ టెక్‌ఫెస్ట్‌లో పాల్గొంటున్నాను

కొత్త జ్ఞానానికి ద్వారం టెక్నోజియాన్



హర్ష, మెకానికల్ సెకండ్ ఇయర్, హైదరాబాద్

జ్ఞానాన్ని విస్తరింప చేసుకునేందుకు, నలుగురితో కలిసి పనిచేసేందుకు, మనలోని భావాలను ఇతరులతో పంచుకునేందుకు టెక్నోజియాన్ ఎంతో ఉపయోగపడుతుంది. మొదట్లో నాకు స్టేజి ఫియర్ ఉండేది. టెక్నోజియాన్‌లో పాల్గొన్న తర్వాత అది పోయింది. నాలో నాయకత్వ లక్షణాలు బలపడ్డాయి. టెక్నోజియాన్ నిర్వహణ బాగుంది. ఏర్పాట్లు బాగా చేశారు.

- సుబేదారి

జోరుగా.. హుషారుగా...

▸▸ సందడిగా రెండో రోజు టెక్నోజియాన్

హనుమకొండ(ఆంధ్రజ్యోతి)/కాజీపేట, జనవరి 20: టెక్నోజియాన్‌లో భాగంగా నిట్ క్యాంపస్‌లో ప్రదర్శనగా పెట్టిన పలు సాంకేతిక ఎగ్జిబిట్లు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ హాళ్లలో, క్యాంపస్ ఆవరణలో వీటిని నిర్వహించారు. నిట్ విద్యార్థులతో పాటు నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు స్వయంగా రూపొందించిన సైన్స్ ఎగ్జిబిట్లు సైతం టెక్నోజియాన్‌లో సందర్శనార్థం పెట్టారు. టెక్నోజియాన్ అంటే ఉన్నత సాంకేతిక విద్యా సంస్థల విద్యార్థులకే పరిమితం చేయకుండా పాఠశాల స్థాయిలో సైన్స్ పట్ల ఆసక్తి కలిగిన ఔత్సాహిక విద్యార్థులను సైతం ప్రోత్సహించే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు. నగరంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు టెక్నోజియాన్‌లోని ఈవెంట్లు, ఎగ్జిబిట్లను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీనితో నిట్ క్యాంపస్ విద్యార్థులతో సందడిగా మారింది. అడుగడుగునా సాంకేతిక సౌరభాలు గుబాళించాయి. ఉదయం 9 గంటల నుంచే టెక్నోజియాన్ కార్యక్రమాలు ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగాయి.

వర్క్‌షాపులు

ఒకపక్క ఈవెంట్ల నిర్వహణతో పాటు మరోపక్క వివిధ అంశాలపై వర్క్‌షాపులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో వైజ్ఞానిక ప్రసంగాలు కూడా కొనసాగాయి. ఎలక్ట్రికల్ వెహికిల్ మోడలింగ్, సిమ్యులేషన్‌పై వర్క్‌షాపును ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లు నిర్వహించారు. వీరు మ్యాట్ ల్యాబ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి సిమ్యులేషన్ ద్వారా ఎలక్ట్రికల్ వాహనాన్ని ఎలా రూపొందించాలో విద్యార్థులకు ప్రదర్శన రూపకంగా వివరించారు. దీనితో పాటు రాపిడ్ ప్రోటోటైపింగ్, 3డి ప్రింటింగ్‌పై నిర్వహించిన మరో వర్క్‌షాపు కూడా విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నది. మెకానికల్ ఇంజనీరింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాపులో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్యాప్చర్ ఎక్స్ అనే సైబర్ భద్రతపై ప్రాథమిక అవగాహనకు శిక్షణనిచ్చే మరో వర్క్‌షాపు కూడా ఈ టెక్నోజియాన్‌కే హైలైట్. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ సొసైటీ ఈ వర్క్‌షాపును సమన్వయం చేసింది.

వైజ్ఞానిక ప్రసంగం

రెడ్‌బస్ జర్నీపై రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం ఇచ్చిన అతిథి ఉపన్యాసం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నది. ఈ ప్రసంగం విని చాలా మంది విద్యార్థులు స్ఫూర్తి పొందారు. రెడ్‌బస్ జర్నీ ప్రస్థానంలో ఎదురైన సవాళ్లు, ప్రతిఘటనలు, విజయాలపై ప్రకాశ్ సంగం సుదీర్ఘంగా ప్రసంగించారు. విద్యార్థులు ఆయనతో కలిసి ఫొటో దిగేందుకు ఉత్సాహం చూపారు. తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



పింగ్ పాంగ్ లాంచర్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

రెండో రోజు ఈవెంట్లు

ఇన్‌సైట్ ఎక్స్, క్యాప్చర్ ఎక్స్, పరిష్కార్, ఆటో ఫ్రాగస్, వెహికిల్ డెమోన్‌స్ట్రేషన్, డిబగ్గింగ్ మానియా, ఇన్నోవేటివ్ స్పేయర్ ఎక్స్‌పో, విర్చువల్ వరల్డ్, ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్, కెమ్ ఈ కేస్, కెమ్ ఈ లిట్రేంత్, సైన్స్ ఎక్స్‌పో, కెమ్ ఫైర్, కెమ్ స్టోరీ, ఎక్స్‌పర్ట్ లెక్చర్, లేజర్ బేస్ట్ గేమ్, ఇన్నోవేటివ్ పెయింటింగ్, మ్యాథ్స్ అండ్ రేట్స్ ఆర్కాడీరియమ్, మైండ్ గ్రిండ్, మెటల్మన్, మెటా రష్, పేపర్ ప్రజంటేషన్, ఎలక్ట్రిక్ ఎక్స్‌పో, రెసిస్టెన్స్ రిలే రేస్, పీజో పవర్ ఆర్కేడ్ నిర్వహించారు. స్పాట్‌లైట్ ఈవెంట్ల విభాగంలో వీఆర్ క్రికెట్, ఎస్కేప్ రూమ్ 1, ఎస్కేప్ రూమ్ 2, ఆర్ బగ్గీ నిర్వహించారు. వీటితో పాటు స్టాడ్‌ప్రో, మ్యాట్‌ల్యాబ్ వినియోగించడం ద్వారా ఈవి స్టిమ్యులేషన్‌పై వర్క్‌షాపులు జరిగాయి. డాక్టర్ నిపట్లపల్లి నర్సమ్మ గెస్ట్ లెక్చర్ ఇచ్చారు.

నేడు విజేతల ఎంపిక

వరంగల్ నిట్‌లో జరుగుతున్న టెక్నోజియాన్‌లో భాగంగా చివరి రోజైన ఆదివారం ఈవెంట్లతో పాటు వర్క్‌షాపులు, గెస్ట్‌లెక్చర్లు కూడా ఉంటాయి. సాయంత్రం 6 గంటలకు ఆడిటోరియంలో ముగింపు కార్యక్రమం ఉంటుంది. ఇందులో టెక్నోజియాన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాల ప్రదానం ఉంటుంది.

త్రిడీ ప్రింటర్

బ్యాడ్జీలు, కీచైన్లను ముద్రించడానికి ఉపయోగించే ప్రింటర్ ఇది. స్కూల్ విద్యార్థుల బ్యాడ్జీలను కానీ, వివిధ కంపెనీల కీచైన్లు, ఇతరత్రా లోగోలను డిజైన్‌చేసి దానిని కంప్యూటర్‌కు అనుసంధానం చేయడం ద్వారా కొద్ది నిమిషాల్లోనే వాటిని ముద్రణలోకి తీసుకురావచ్చు. దీనివల్ల ఖర్చు తక్కువ. సమయం కూడా వృథాకాదు. త్రిడీ ప్రింటర్‌ను పాఠశాల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.



ఆర్టిమేనియా



ఇది నైపుణ్యంతో రోబోలను నిర్దేశిత గమ్యస్థానం వరకు నడిపే ఈవెంట్. ఇందులో పాల్గొనే వారు తమ రోబోలతో పాల్గొనాల్సి ఉంటుంది. రోబోలు నడిపే మార్గంలో అనేక అడ్డంకులు ఉంటాయి. వాటిని అధిగమిస్తూ నిర్దేశిత గమ్యానికి రోబోలను ఎవరైతే విజయవంతంగా నడిపిస్తారో వారే విజేతలు.

పోటా పోటీగా ఈవెంట్లు

- వినూత్న రీతిలో నిర్వహణ
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు

హనుమకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో నిర్వహిస్తున్న టెక్నోజియాన్‌లో భాగంగా ప్రదర్శిస్తున్న పలు ఈవెంట్లు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. విద్యార్థులు ఈవెంట్లలో పోటాపోటీగా పాల్గొంటున్నారు. విజేతలుగా నిలవడానికి శ్రమిస్తున్నారు. ఈవెంట్లలో మచ్చుకు కొన్ని...

ఈపీవీ రేసింగ్



టెక్నోజియాన్‌లోని రెండు అక్షరాలు టిజెడ్‌తో ఒక డిజైన్‌ను రూపొందించారు. ఈ డిజైన్‌లో గీతలను తాకకుండా రోబో లను నడపాలి. ఇలా ఎవరైతే నడుపుతా రో వారే విజేతలు. నగదు బహుమతిని అందచేస్తారు. ఈ ఈవెంట్‌లో 40మందికి పైగా విద్యార్థులు రోబోలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రోబోలను చాకచక్యంగా నడపడమే ఈ ఈవెంట్ లక్ష్యం

ఆల్ టెర్రేయిన్ వాహనం



వరంగల్ నిట్‌లోని మెకానికల్ విద్యార్థులు స్వయంగా రూపొందించిన ఈ ఆల్ టేర్రేయిన్ వాహనం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొండలు, గుట్టలు, ఇతర ఎత్తైన ఏ ప్రాంతంలోనైనా ఈ వాహనం నడవగలుగుతుంది. ఇటీవల నిర్వహించిన వాహనాల ప్రదర్శనలో దీనికి రూ.15వేల నగదు బహుమతి కూడా లభించింది. ప్రస్తుతం సింగిల్ సీటర్ వాహనాన్ని రూపొందించారు. దీనిని తయారు చేయడానికి రూ.10లక్షల వరకు ఖర్చయింది. ఇందులో ఉపయోగించిన విడిభాగాలన్నీ విద్యార్థులే స్వయంగా తయారు చేశారు.

పియోజ్ పవర్ ఆర్క్యాడ్



వరంగల్ నిట్‌లోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ సొసైటీ వారు ఈ పరికరాన్ని రూపొందించారు. వ్యక్తుల శక్తిని అంచనా వేయడానికి రూపొందించిన పరికరం ఇది. పీజోమెటీరియల్‌తో ప్యాడ్‌ను రూపొందించారు. దీనిపై సుత్తితో ఒక మనిషి కొడితే ఉత్పన్నమయ్యే శక్తిని పీజోమెటీరియల్ సర్క్యూట్ రికార్డు చేసి దానికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ స్క్రీన్‌పై ప్రదర్శిస్తుంది. మెకానికల్ ఎనర్జీని ఎలక్ట్రికల్ ఎనర్జీగా మార్చడమే ఈ పరికరం ముఖ్య ఉద్దేశ్యం.

పిక్సల్ నుంచి పోర్ట్రేయిట్‌లు



కంప్యూటరైజ్డ్ న్యూమెరికల్ కంట్రోలర్ మెషీన్ నిజమైన ఇమేజ్‌ను రూపొందించడమే ఈ ఈవెంట్ ముఖ్య ఉద్దేశం. సాధారణంగా ఒక వ్యక్తి చిత్రాన్ని పెన్సిల్‌తో లేదా రంగులతో చేయితో వేస్తాం. లేదా ఫొటో తీస్తాం. కానీ ఇక్కడ ఒక వ్యక్తి చిత్రాన్ని న్యుమెరికల్ కంట్రోలర్ మెషీన్ కంప్యూటర్ సహాయంతో నిజమైన ఇమేజ్‌గా కొద్ది సెకండ్లలో రూపొందిస్తుంది.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి అధిక నిధులు

▸▸ ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తాం

▸▸ రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ సిటీ, జనవరి 20 : రాష్ట్ర బడ్జెట్‌లో వరంగల్ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో ఆడంబరాలు, ఆర్భాటాలే తప్ప.. అభివృద్ధిని ఆచరణలో చూపలేదని విమర్శించారు. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి అంశంపై హనుమకొండలోని కలెక్టరేట్‌లో సమీక్ష జరిపారు. సమీక్ష అనంతరం మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు తమ స్వార్థప్రయోజనాల నెరవేర్చుకునేందుకే పాలన సాగించారన్నారు. అంతేకానీ.. ప్రజలకు, నియోజకవర్గాలకు ఉపయుక్తమయ్యే అభివృద్ధిని సాధించలేదని విమర్శించారు. ప్రతీ ప్రాజెక్టు ప్రకటన వెనుక స్వలాభం చూసుకున్నారని ఆరోపించారు. ఆ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో కానీ, ప్రజలకు ఉపయోగపడేలా మలచడంలో నిజాయితీగా వ్యవహరించలేదని మండిపడ్డారు. ప్రతీ శాఖలో ఇదేతీరు నెలకొందన్నారు. వీటన్నింటినీ కూలంకశంగా సమీక్షించినట్లు చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో ప్రకటించిన ప్రాజెక్టుల వల్ల ప్రజలకు జరిగే మేలు, నిధుల వ్యయం, వాటి పూర్తి తదితర అంశాలను సమీక్షించి నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా కాంగ్రెస్ పాలన సాగుతుందన్నారు. ప్రజాపాలన ద్వారా సేకరించిన దరఖాస్తుల కంప్యూటీకరణ తదుపరి అమలు ప్రక్రియ ఉంటుందన్నారు.

ప్రజాభిప్రాయానికి అనుగుణంగా మాస్టర్ ప్లాన్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్ నగరాభివృద్ధి కోసం ప్రజాభిప్రాయానికి అనుగుణమైన మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయనున్నట్లు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ నేతలు తమ స్వార్థ ప్రయోజనాలు, భూములకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించారని ఆరోపించారు. దీనిని ప్రక్షాళన చేసి సమగ్ర సవరణలతో నగరాభివృద్ధి, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని ఆమోదయోగ్యమైన మాస్టర్‌ప్లాన్ తీసుకొస్తామన్నారు. ఇందుకు కొంత సమయం పడుతుందని చెప్పారు. నగరంలో త్వరలోనే రెండు పడక గదుల పంపకాన్ని చేపడతామన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలం, రూ.5 లక్షలు అందచేస్తామన్నారు.

కాళోజీ కళాక్షేత్రానికి పదేళ్లా..?

బీఆర్ఎస్ పాలన ఎంత స్వార్థరహితమో హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రమే నిదర్శనమని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ప్రగతిభవన్ 8నెలల్లో పూర్తయ్యిందని, కాళోజీ కళాక్షేత్రం మాత్రం పదేళ్లు గడిచినా పూర్తి కాలేదన్నారు. యుద్ధ ప్రాతిపదికన కళాక్షేత్రాన్ని తాము పూర్తి చేయనున్నట్లు చెప్పారు.

మేడారం జాతరకు రూ.105 కోట్లు

మేడారం జాతర నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.105కోట్లు కేటాయించిందని మంత్రి సీతక్క వెల్లడించారు. తొలుత రూ.75 కోట్లు ప్రకటించామని, మరో రూ.30 కోట్లు కూడా జాతర నిర్వహణకు ఇవ్వనున్నట్లు చెప్పారు.

కాలువల అభివృద్ధికే మోక్షం లేదు..

ఇరిగేషన్ ప్రాజెక్టు పేరిట బీఆర్ఎస్ బీరాలు పలికిందని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని, పచ్చని తెలంగాణగా మారుస్తామన్న ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు నీటి మూటలయ్యాయని దుయ్యబట్టారు. ఇరిగేషన్‌పరంగా తెలంగాణను ప్రపంచానికే రోల్ మోడల్‌గా నిలుపుతామని ప్రగల్భాలు పలికిన బీఆర్ఎస్.. కనీసం ప్రధాన కాలువలను అభివృద్ధి చేయలేదని విమర్శించారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు అస్తవ్యస్తంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇరిగేషన్ రంగంపై ప్రత్యేక దృష్టితో ఉందన్నారు. బీఆర్ఎస్‌లా కాకుండా పక్కా ప్రణాళికలతో ప్రాజెక్టులను పూర్తి చేస్తామని వెల్లడించారు.

కబ్జారాయుళ్లను వదలం

ప్రభుత్వ భూములను దొడ్డిదారిన కాజేసిన బీఆర్ఎస్ నేతలను వదలమని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. కబ్జారాయుళ్లు ఎంతటి వారైనా సరే చర్యలు ఉంటాయన్నారు. అన్యాక్రాంతమైన భూములను జీవో 59 ద్వారా అర్హులైన పేదలకు అందచేస్తామన్నారు.

ప్రజలు పండబెట్టారు..

పులి వస్తోంది.. అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రశ్నకు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పులి వంద మీటింగ్‌లు పెట్టింది.. ఏం జరిగింది.. ప్రజలు పండబెట్టారంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ను ప్రజలు తిరస్కరించిన సంగతి గుర్తించాలన్నారు. ఇక జనవరి నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించొద్దనే ప్రకటనలు చేస్తూ మాజీ మంత్రి కేటీఆర్ తెగ బాధపడుతున్నారని శ్రీనివాస్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ హామీ ఇచ్చిన సంగతి, దానిని అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు ఉందని సమాధానమిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతుందన్నారు.

ప్రజా పాలనకు అర్థం కాంగ్రెస్

ప్రజాపాలన అనే దానికి పరిపూర్ణ అర్థం కాంగ్రెస్ అని మంత్రి సురేఖ వెల్లడించారు. అన్నివర్గాల సంక్షేమం కాంగ్రెస్ పాలనలోనే జరిగిందన్నారు. మళ్లీ ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్న సంతోషం ప్రజల్లో స్పష్టమవుతోందన్నారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. ఒక్కో నియోజకవర్గంలో అలవికాని విధంగా రూ.300 కోట్లకు పైగా అభివృద్ధి పనులంటూ ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ నిధుల విషయంలో కూడా బీఆర్ఎస్ అనాలోచితంగా వ్యవహరించిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో బిల్లులు లేక సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్న సంగతి కేటీఆర్ గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ అన్నారు. ఆయనకు సర్పంచ్‌ల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, యశస్వినీరెడ్డి, మురళీనాయక్ పాల్గొన్నారు.

సర్కారు లక్ష్యాలు నెరవేర్చండి..

(5వ పేజీ తరువాయి)

గుర్తుచేశారు. అందరం సమష్టి కృషితో జాతర విజయవంతంగా పూర్తి చేద్దామన్నారు. రామప్ప, లక్నవరం సరస్సుల అనుసంధానం కోసం భూసేకరణ జరిగిందన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలన నిర్బంధంలో సాగిందని, ఉద్యోగులు ఒత్తిడికి గురయ్యారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరి సంక్షేమాన్ని కోరేదని, స్వేచ్ఛగా ప్రజలకు సేవలు అందించండని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలని, నిర్లక్ష్యం ప్రదర్శించవద్దన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని అన్నారు. ఇందులో ఎలాంటి వివక్షకు తావులేదన్నారు. బీఆర్ఎస్ స్వార్థపాలన ముగిసిందని, ప్రజలు కోరుకున్న ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అభివృద్ధి ఫలాలను ఆచరణలో చూపాలని కోరారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వరంగల్ మహానగరాభివృద్ధి కోసం జీడబ్ల్యూఎంసీకి అధిక నిధులు కేటాయించాలని కోరారు. పశ్చిమలో కబ్జాకు గురైన చెరువులు, కుంటల పరిరక్షణ జరగాలన్నారు. అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టాలన్నారు. ఎవరికి భయపడవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. మడికొండ డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. డంపింగ్ యార్డులో పొగ కారణంగా పలు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. విలీన గ్రామాల్లో సమస్యలు నెలకొన్నాయని, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల సేవలు మెరుగ్గా అందించాలని సూచించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. జీడబ్ల్యూఎంసీ పరిధిలోని మూడు డివిజన్లు పరకాల నియోజకవర్గంలో ఉన్నాయని వీటి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అన్నారు. నిధులు కేటాయించాలని కోరారు.

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

(5వ పేజీ తరువాయి)

ఫైర్ అయ్యారు. ఎవరిని పిలవాలో.. ఎవరిని వద్దనాలో.. తమకు తెలుసని.. ఇదేం మీ ప్రభుత్వం కాదంటూ మంత్రి పొన్నం ఫైర్ అయినట్లు తెలిసింది. అంతలోనే మంత్రి శ్రీనివాస్‌రెడ్డి స్పందిస్తూ కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ విషయంలో అధికారుల తీరుపై విచారణ జరిపిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి చెప్పినట్లు తెలిసింది. అంతటితో పరిస్థితి సద్దుమణిగింది.

సమీక్షకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీల దూరం

హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు డాక్టరు బండా ప్రకాశ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎంపీ పసునూరి దయాకర్‌లకు సమాచారం లేనట్లు తెలిసింది. ఈ విషయమై వారు అధికారుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

అభివృద్ధి పనులపై నజర్

▸▸ వివిధ ప్రాంతాలను సందర్శించిన మంత్రి పొంగులేటి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 20: వరంగల్ నగర పర్యటనకు శనివారం వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నగరాభివృద్ధి ప్రణాళికలు, పనులను పరిశీలించారు. మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని పెద్దపెండ్యాల కరుణాపురం జంక్షన్ వద్ద మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు తదితరులు స్వాగతించారు. అనంతరం కరుణాపురం వద్ద జంక్షన్ నిర్మాణం, స్వాగత తోరణం, రింగ్ రోడ్డు బ్రిడ్జి మీదుగా హైదరాబాద్-హనుమకొండ జాతీయ రహదారికి అనుసంధానంగా ఫ్లైఓవర్ నిర్మాణం అంశాలను శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. హైదరాబాద్ నుంచి వరంగల్‌కువెళ్లే రోడ్డు మార్గం సరిగ్గా లేదని ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయం మేరకు మంత్రులు సందర్శించారు. సంబంధించిన మ్యాప్‌ను మంత్రులకు వివరించారు. అనంతరం రోడ్డు మార్గం లోపాలను సమగ్ర వివరాలతో నివేదికను సిద్ధం చేయాలని హైవే అథారిటీ, కుడా అధికారులను మంత్రి ఆదేశించారు. వరంగల్‌కు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం ఉండే విధంగా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టరేట్‌లో సమీక్ష జరిపారు. అక్కడి నుంచి సాయంత్రం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.



నిర్మాణాలను మంత్రులకు వివరిస్తున్న గృహ నిర్మాణ మండలి, రామ్‌కీ ఇన్‌ఫ్రా అధికారులు

అనంతరం వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలోని రాంకీ గేటెడ్ కమ్యూనిటీలో రాంకీ నిర్మించి తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ మండలికి అప్పగించిన అల్పాదాయ వర్గాల 102 గృహాల సముదాయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ నిర్మాణాల వివరాలను తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ మండలి ఈఈ రాధాకృష్ణ (హైదరాబాద్), రాంకీ ఇన్‌ఫ్రా ఏజీఎం అనిల్‌లు మంత్రులు శ్రీనివాసరెడ్డి, సురేఖలకు వివరించారు. నిర్మాణాలను నాణ్యతతో సత్వరం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.



హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సనాతన ధర్మ నియమాలను పాటించాలి

వడ్డెపల్లి, జనవరి 20: మానవజాతి ఒకరినొకరు ఆదర్శప్రాయంగా తీసుకొని సద్గునాలతో సనాతన ధర్మ నియమాలను పాటిస్తూ ఉండాలని డాక్టర్ నందివాడ అనంతలక్ష్మి ప్రవచించారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శ్రీమద్రామాయణ సప్తాహంలో భాగంగా మొదటి రోజు శనివారం డాక్టర్ నందివాడ అనంతలక్ష్మి తన ప్రవచాన్ని ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా 'సీతారాముల ఆదర్శ దాంపత్యం' అనే అంశంపై ఆమె ప్రసంగిస్తూ సీతారాములు ఆదర్శ దంపతులని అన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి లక్ష్మణాచార్యులు నిర్వహించిన సంగీత విభావరి ఆహుతులను ఆద్యంతం అలరింపజేసింది. కార్యక్రమంలో సాహితీవేత్త గిరిజా మనోహర్ రావు, నిర్వాహకులు సౌమిత్రి లక్ష్మణాచార్యులతో పాటు ఉత్తమ్‌రాజ్ వికాస్, సేవా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సప్తధామంలో సీతారామ కల్యాణం



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న త్రిపురనేని గోపీచంద్

వడ్డెపల్లి, జనవరి 20: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకొని ఆదివారం ఉదయం 9 గంటలకు వరంగల్ ములుగురోడ్‌లోని సప్తధామంలో 1,116 జంటలతో సమష్టి శ్రీసీతారామ కల్యాణం, పట్టాభిషేకం నిర్వహించడానికి సకల ఏర్పాట్లు చేశామని శివానందగురు కల్చరల్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరామచంద్రుడినే ప్రభువుగా తలచి ప్రజలను రామరాజ్యంలో మాదిరిగా కరువు కటకాలు, హింస, పేదరికం, అనారోగ్యం బారిన పడకుండా, మోసాలకు గురికాకుండా అందరికీ సమన్యాయం జరిగేలా పాడిపంటలు, ధనధాన్యవృద్ధి, ఆయుష్షు దేశ ప్రజలకు ఇవ్వమని సమిష్టిగా ప్రసాదించాలని కోరారు. ధర్మపురి పీఠాధిపతి తపోవనం శ్రీసచ్చిదానంద సరస్వతి మహాస్వామి హాజరవుతున్నారని పేర్కొన్నారు. భక్తులు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలకాలని కోరారు. సమావేశంలో ట్రస్టీలు బండారు సాయినారాయణ, సోమ రామయ్య, గందె ఉమాశంకర్, సదాశివుడు, పబ్బతి నరేష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రాన్స్‌ఫోర్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సీఐటీయూ నాయకుల వినతి పత్రం

కాళోజీజంక్షన్, జనవరి 20: ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ రంగం (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి బొల్లారం సంపత్ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. సమీక్ష సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన మంత్రికి కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది కార్మికులు రవాణా రంగంపై ఆధారపడి స్వయం ఉపాధి పొందుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్మికుల్లో ఎక్కువ శాతం చదువుకున్న యువకులు ఉద్యోగాలు లేక ప్రైవేటు ఫైనాన్స్ అప్పులు తీసుకొని రంగంలోకి వస్తున్నారని వినతి పత్రంలో వివరించారు. ప్రభుత్వం వారికి ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు రవాణాశాఖ అధికారులు భారీ పెనాల్టీలు విధించడంతో కార్మికులపై విపరీతమైన భారం పడుతోందని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోకార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సీఐటీయూ నాయకులు పల్నాటి రమేష్, ఇమిడి సుధాకర్, దేవేందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అత్తారింటికి మంత్రి పొన్నం

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి హోదాలో తన అత్తారింట్లో అడుగు పెట్టారు. హనుకొండ కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన అధికారులతో సమీక్ష సమావేశానికి హాజరైన ఆయన సమీక్ష అనంతరం.. తన అత్తవారి ఇల్లు అయిన వడ్డెపల్లి విజయ్‌పాల్‌కాలనీలోని హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్ ఇంటికి వచ్చారు. పెద్ది వెంకటనారాయణగౌడ్ ప్రథమ కుమార్తె మంజులను 2000లో పొన్నం ప్రభాకర్‌తో వివాహం జరిపించారు. వివాహ సమయంలో పొన్నం ప్రభాకర్ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అత్తారింట్లో మంత్రి సుమారు అరగంట సేపు సేద తీరి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు.


మంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

మత రాజకీయాలను తిప్పికొట్టాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

హనుమకొండ క్రైం, జనవరి 20: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, బీజేపీ ప్రభుత్వ మత రాజకీయాలను తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ హాజరై మాట్లాడారు. ఫిబ్రవరి 16న అఖిల భారత గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున మద్దతు పలికి సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంలో విఫలమైందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాద శక్తులను ఉసిగొలిపి హత్యారాజకీయాలకు పాల్పడుతోందని అన్నారు. ఇంకా అయోధ్య రామమందిరాన్ని తెరపైకి తెస్తూ రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రజల్లో చైతన్యం తేవడం కోసం దేశంలో అన్ని జాతీయ కార్మిక సంఘాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, జిల్లా నాయకులు రాములు, చుక్కయ్య, ప్రభాకర్‌రెడ్డి, మెట్టు రవి, చక్రపాణి, వెంకటేశ్, లింగయ్య, సారంగపాణి, అశోక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయింనగర్, జనవరి 20: ఎన్‌పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటనెన్స్‌లో భాగంగా ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, చైతన్యపురికాలనీ ప్రాంతాలలో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. అదేవిధంగా పోలీస్ హెడ్‌క్వార్టర్స్, రాంనగర్, జవహర్ కాలనీ ఏరియా, నందితా నగర్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, నందిహిల్స్ దీనదయాళ్ నగర్, శ్రీరామ కాలనీ, రామారావు కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, హనుమకొండ చౌరస్తా, కాకాజీ కాలనీ, న్యూబస్టాండ్ ఏరియా, టైలర్స్ స్ట్రీట్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ సాంబరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అలాగే ఎన్‌పీడీసీఎల్ వరంగల్ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా స్టేషన్ రోడ్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రెన్ మార్కెట్, స్టేషన్‌రోడ్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. అదేవిధంగా ఓసిటీ, పోచమ్మమైదాన్ సర్కిల్, కొత్తవాడ, డాక్టర్స్ కాలనీ, పైడిపల్లి, మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్, జన్మభూమి జంక్షన్, సామిల్, ఆంధ్రాబ్యాంక్, శంభునిపేట, ఉర్సు పాపయ్యపేటచమన్, మసీద్‌రోడ్, జెమినీ థియేటర్ రోడ్, ఎల్లమ్మ బజార్, జ్యోతికాలనీ, గణేష్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఎలక్ట్రికల్, ఆపరేషన్ వరంగల్ డివిజనల్ ఇంజనీర్ శంకేశి మల్లికార్జున్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, జనవరి 20: కాజీపేట మండలం కడిపికొండ ప్రాంతంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి చేరేందుకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8 తరగతులకు సంబంధించి ప్రవేశాలు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. 5వ తరగతిలో ఉన్న 80 సీట్లకు ఎస్సీ 5, బీసీ 10, ఎస్టీ 3, ఓసీ 2 సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. మిగిలిన సీట్లన్ని మైనారిటీ విద్యార్థులకు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 9 లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

వరంగల్ లోక్‌సభ టికెట్ కేటాయించాలి


ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న కందుకూరి రజినీకాంత్

వడ్డెపల్లి, జనవరి 20: కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం కలిగిన తనకు వరంగల్ లోక్‌సభ టికెట్ కేటాయించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కందుకూరి రజినీకాంత్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కోరారు. బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ తాత కందుకూరి కాంతయ్య హనుమకొండ మండలం గోపాల్‌పూర్ సర్పంచ్‌గా సుమారు 20 ఏళ్ల పనిచేసి అప్పటి విద్యాశాఖ మంత్రి డాక్టర్ పీవీ రంగారావుకు, అప్పటి మంత్రి హయగ్రీవాచారికి సన్నిహితుడిగా పనిచేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తనకు లోక్‌సభ సీటు కేటాయించి తగిన న్యాయం చేయాలని సీఎం రేవంత్‌ను కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వేముల రమేష్, రాజు, ఇమ్మడి అశోక్ బాబు, దండ్రె రమేష్, పుల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే ఎస్ఎంసీ కమిటీలను ఎన్నుకోవాలి

ఐనవోలు, జనవరి 20: విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేసే ఎస్ఎంసీ కమిటీలను ఎన్నుకోవాలని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు విద్యార్థుల తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఐనవోలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 29న జరిగే ఎస్ఎంసీ కమిటీ ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శనివారం ఐనవోలు గ్రామ పంచాయతీ కార్యాలయం నోటీసు బోర్డుపై అంటించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, భీమాళ్ల సారయ్య, పంచాయతీ కార్యదర్శి కిషోర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని మంత్రికి వినతి

హనుమకొండ రూరల్, జనవరి 26: హనుమకొండ నయింనగర్ నాలాకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిలో కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు, అక్రమ కట్టడాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతులు ఇచ్చారని, వాటిపై దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా పర్యటనకు విచ్చేసిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మహమ్మద్ అంకూస్ వినతిపత్రం సమర్పించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశం అనంతరం మంత్రిని కలిసి ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై వివరించారు. కాజీపేట, హనుమకొండ, వరంగల్‌లోని గొలుసుకట్టు చెరువులు, కుంటలు, నాలాలను తక్షణమే సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని వినతిపత్రం పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు, ఆస్తులను కాపాడాలని అంకూస్ కోరారు.

రావు పద్మకు ఘన సన్మానం


సన్మానం చేస్తున్న నాయకులు

కాజీపేట, జనవరి 20 : హనుమకొండ బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా రెండోసారి నియామకం జరిగిన రావు పద్మను శనివారం ఆమె కార్యాలయంలో కాజీపేటకు చెందిన బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. బొకే ఇచ్చి శాలువా కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ అసెంబ్లీ కన్వీనర్ తిలక్ కుమార్, పీఏసీఎస్ దర్గా సొసైటీ డైరెక్టర్ కాయిత రాజ్‌కుమార్, నాయకులు సుంచు ప్రశాంత్, కవిత కుమారి, బి. సారంగం, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు కారం సినిమాను నిషేధించాలి

ఐనవోలు, జనవరి 20 : గుంటూరు కారం సినిమాను నిషేధించాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. ఐనవోలులో శనివారం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల రాజ్యం కోసం పాటుపడిన కారల్ మార్క్స్, లెనిన్ పేర్లను గుంటూరు కారం సినిమాలో విలన్లుగా చిత్రీకరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు కారం సినిమాను నిషేధించకపోతే పెద్దఎత్తున్న ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఫిలిమ్ సెన్సార్ బోర్డు ప్యానల్ మెంబర్‌కు సన్మానం


మధుకర్‌ను సన్మానిస్తున్న యూత్ ప్రతినిధులు

వడ్డెపల్లి, జనవరి 20: హనుమకొండ వడ్డెపల్లి చర్చి ప్రాంతానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు జన్ను మధుకర్ సెంట్రల్ ఫిలిమ్ సెన్సార్ బోర్డు ప్యానల్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లోని జై భీం యూత్ కార్యాలయంలో శనివారం జై భీం యూత్ జిల్లా కన్వీనర్ తాళ్లపల్లి విజయ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జైభీం యూత్‌ప్రతినిధులు తాళ్లపల్లి యోబు, ప్రశాంత్‌కుమార్, సుదర్శన్, పీటర్, ప్రవీణ్, రత్నం, వీరస్వామి, దాసు, పవన్, మధు, సతీష్ పాల్గొన్నారు.

గౌతమికి డాక్టరేట్


గౌతమి

హనుమకొండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీ పరిశోధకురాలు డి.గౌతమికి డాక్టరేట్‌ను శనివారం ప్రదానం చేసింది. 'సింథసిస్, బయోలాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ నావెల్ క్వినోక్సలిన్, ఇండోల్ స్పైరోల్స్ థెయిర్ మాలిక్యూలర్ డా కింగ్ స్టడీస్' అనే అంశంపై ఆచార్య రవీందర్ పర్యవేక్షణలో పరిశోధన నిర్వహించారు. ఆమె సమర్పించిన పత్రానికి డాక్టరేట్ లభించింది. విశ్వవిద్యాలయ కులపతి డాక్టర్ సీహెచ్‌వీ.పురుషోత్తం, ఉప కులపతి గుర్‌రావు దామోదర్, పరిపాలన అధికారి సాత్విక రెడ్డి తదితరులు గౌతమిని అభినందించారు.

ధనలక్ష్మీ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం


బ్యాంక్ సేవలను ప్రారంభిస్తున్న హిమబిందు

హనుమకొండ రూరల్, జనవరి 20: ధనలక్ష్మీ బ్యాంక్ నూతన శాఖ కార్యాలయాన్నిహనుమకొండ సుబేదారిలో ఏర్పాటు చేయగా రీజినల్ హెడ్ కె.సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధనలక్ష్మీ బ్యాంకులో అన్నిరకాల రుణసౌకర్యంతోపాటు విస్తృతమైన సేవలు అందిస్తామన్నారు. నూతన బ్రాంచ్ మేనేజర్ కె.హిమబిందును ఖాతాదారులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకుకు అరుదైన గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి

కాళోజీ జంక్షన్, జనవరి 20: హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ నేషనల్ అక్రిడేషన్ బోర్డు ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్‌కు సంబంధించిన అక్రిడేషన్ సర్టిఫికెట్ గుర్తింపు పొందిందని రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్ చందర్‌రెడ్డి అన్నారు. రెడ్‌క్రాస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విజయోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడుతూరాష్ట్రంలో అక్రిడేషన్ పొందిన రెండో బ్లడ్ సెంటర్ హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు కావడం గర్వకారణమన్నారు. రక్త కేంద్రంలో రక్త సేకరణ మొదలుకొని రక్త నిల్వలు, రక్త పరీక్షలు, దాతల నుంచి రక్త సేకరణలో ఎన్ఏబీహెచ్ సూచించిన నాణ్యత ప్రమాణాలన్నింటినీ పాటిస్తున్నట్లుగా నిర్ధారించి అక్రిడేషన్ సర్టిఫికెట్ ఇచ్చారని ఆయన వివరించారు. గుర్తింపు రావడానికి సహకరించిన సిబ్బందికి విజయ్‌చందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి అభినందించారు.

ఈ సమావేశంలో ఇంకా రెడ్ క్రాస్ రాష్ట్ర పాలక వర్గ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, డాక్టర్ శేషు మాధవ్, పొట్లపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ కె. సుధాకర్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్. సంధ్యా రాణి, చెన్నమనేని జయశ్రీ, బిల్లా రమణారెడ్డి, బాశెట్టి హరిప్రసాద్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముదిరాజ్ కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ, సదానందం

వడ్డెపల్లి, జనవరి 20: ముదిరాజ్ కార్పొరేషన్‌కు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.5వేల కోట్ల నిధులు కేటాయించాలని, ముదిరాజ్‌లను బీసీ-డీ గ్రూప్ నుంచి బీసీ-ఏ గ్రూప్‌లో చేర్చాలని ముదిరాజ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పొల్కం లక్ష్మీనారాయణ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి వెంగళ సదానందం ముదిరాజ్‌లు డిమాండ్ చేశారు. బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతీ గ్రామంలో ముదిరాజ్‌లకు ఉపాధి కల్పించేందు కోసం పండ్ల చెట్లు పెంచుకోవడానికి 5ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని తెలిపారు. హైదరాబాద్‌లో 5 ఎకరాల స్థలం కేటాయించి ముదిరాజ్‌ల కోసం ప్రత్యేక వసతి గృహం నిర్మించి కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మంత్రి వర్గంలో ముదిరాజ్‌లకు స్థానం కల్పించడంతో పాటు ముదిరాజ్ మహిళల కోసం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రతీ ముదిరాజ్ కులస్తుడికి ప్రభుత్వమే ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని, మత్స్యశాఖ సహకార సంఘాల్లో సభ్యత్వాలను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ముదిరాజ్ జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు కొత్త నారాయణ, పగిడాల సుధాకర్, లింగాల పుష్పలత, కొత్త నారాయణ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

క్వెస్ట్ గణిత ఒలంపియాడ్‌లో రామన్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

వడ్డెపల్లి, జనవరి 20: హనుమకొండ సుబేదారిలోని రామన్ హైస్కూల్ విద్యార్థులు గత నెలలో హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి క్వెస్ట్ పోటీల్లో పాల్గొని ప్రతిభ పాటవాలను ప్రదర్శించి ప్రతిభను కనబర్చారు. రామన్ విద్యార్థులు ఈ ఫలితాలలో 2వేలలోపు వంద ర్యాంకులు సాధించగా అందులో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి వంద లోపు ర్యాంకులను 16 మంది విద్యార్థులు విజయం సాధించారు. వీరిని పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కరస్పాండెంట్ రామినేని రాజేష్‌కుమార్, డైరెక్టర్ తీర్థాల పురుషోత్తం, మడికొండ ప్రిన్సిపాల్ స్రవంతి, హనుమకొండ వైస్ ప్రిన్సిపల్ అనుపమ తదితరులు విద్యార్థులను అభినందించారు.

బాలవికాసలో సేంద్రియ రైతు సభ

కాజీపేట, జనవరి 20: కాజీపేట బాలవికాస ఆధ్వర్యంలో ఫాతిమానగర్‌లో సుస్థిర వ్యవసాయం సమీకృత అభివృద్ధిపై శనివారం మహాసభ జరిగింది. ఈ కార్యక్రమాన్ని బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిస్సా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయ రంగంలో ముగ్గురితో ప్రారంభించి 1500 ఈ వ్యవసాయం చేయడం గర్వంగా ఉందన్నారు. విదేశాల్లో కూడా సేంద్రియ వ్యవసాయం నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి, డాక్టర్ ఉమారెడ్డి, రైతులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బాలథెరిస్సా

కాజీపేట మోడల్ స్టీమ్ లోకో రైలింజన్ స్థల మార్పు


స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన అధికారులు

కాజీపేట, జనవరి 20: కాజీపేట రైల్వే స్టేషన్ పక్కనే ఏర్పాటు చేసిన మోడల్ స్టీమ్ లోకో ఇంజన్‌ను శనివారం రైల్వే అధికారులు ఉన్న స్థలం నుంచి మార్చి స్టేషన్‌కు ఎదురుగా కొంతదూరంలో ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద పెద్ద క్రేన్‌లను తెప్పించి సుమారు 30 మంది రైల్వే కార్మికులు, ఇతర అధికారుల పర్యవేక్షణలో ఇంజన్‌ను భాగాలుగా విడదీసి తరలించారు. రైల్వే స్టేషన్‌ను ఉన్నతీకరించే క్రమంలో భాగంగా ఈ మోడల్ రైలింజన్‌ను మార్చుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వేకు కేంద్రమైన కాజీపేట డీజిల్‌షెడ్‌లో రైల్వే బ్రేక్ డౌన్ బ్యాచ్ 12 మంది టీం సభ్యులు 2008లో దీనిని తయారు చేశారు. 1953 నుంచి 1992 మధ్యకాలంలో బొగ్గుతో నడిచే ఈ స్టీమ్ రైలింజన్ కనుమరుగవుతుతున్న క్రమంలో 2014లో కాజీపేట స్టేషన్ ముందు ముస్తాబు చేసి ఏర్పాటు చేశారు. రైల్వేస్టేషన్‌లో ఈ స్టీమింజన్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది.

రైల్వే ఆఫీసర్ క్లబ్‌లో బాట్మింటన్ పోటీలు

కాజీపేట, జనవరి 20: జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో రైల్వే క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. శనివారం రైల్వే ఆఫీసర్ క్లబ్‌లో బ్యాట్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో సింగిల్ విన్నర్స్‌లో ధర్మపురి క్రాంతి విజయం సాధించగా, సింగిల్స్ రన్నర్‌లో కన్నెబోయిని యాకన్న విజయం సాధించారు. అనంతరం క్యారమ్స్, బిలియట్స్, స్నూకర్స్, ముగ్గుల పోటీలు, క్రికెట్ పోటీలను రైల్వే ఆస్పత్రి సీనియర్ ఎంఎస్ డాక్టర్ నిరంజన్, డీఎంఈ అనికేత్ కాడెలు ప్రారంభించారు. డీజిల్ రైల్వే ఇనిస్టిట్యూట్, ఇంజనీరింగ్ సెంట్రల్ టీం మధ్య జరిగిన క్రికెట్ పోటీలలో డీజిల్ రైల్వే ఇనిస్టిట్యూట్ టీం విజయం సాధించింది. లోకో 11 టీం, భద్రాచలం టీం మధ్య జరిగిన క్రికెట్ పోటీలలో భద్రాచలం టీం విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం. రాజయ్య, కోశాధికారి జి. రాజేశ్వర్ రావు, ఇనిస్టిట్యూట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధిష్ఠానం అవకాశమిస్తే ఎంపీగా పోటీ చేస్తా..

తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లికొండ వీరేందర్


సమావేశంలో మాట్లాడుతున్న వీరేందర్

కేయూ క్యాంపస్, జనవరి 20: బీఆర్ఎస్ అధిష్ఠానం అవకాశం ఇస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికలల్లో వరంగల్ ఎంపీగా బరిలో నిలుస్తానని తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లికొండ వీరేందర్ స్పష్టం చేశారు. శనివారం సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో మాదిగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వీరేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని తెలంగాణ స్వరాష్ట్రాన్ని సాధించినట్లు వెల్లడించారు. మాదిగ విద్యార్థి ఉద్యమ నేతగా ప్రజల్లో విస్తృతమైన గుర్తింపు కలిగిన తనకు బీఆర్ఎస్ అధిష్ఠానం అవకాశం కల్పిస్తే తప్పక గెలుపు సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ మాదిగ జేఏసీ నేతలు కన్నం సునిల్, దుప్పటి కిశోర్, బొల్లె మధుకర్, ప్రేమ్, దుప్ప టి శుభాష్, బరిగెల బాబు, యాకయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సుబేదారి, జనవరి 20: ఆవోపా హనుమకొండ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి సహకారంతో సుబేదారిలోని ఆవోపా భవన్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 195 మందికి వైద్య సేవలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు నల్లాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఇమ్మడి పుల్లయ్య, కోశాధికారి సుధాకర్, డాక్టర్ రవీందర్, పాల్గొన్నారు.

ఎరుకల ఎంపవర్‌మెంట్ పథకాన్ని అమలుచేయాలి

వడ్డెపల్లి, జనవరి 20: సామాజిక , రాజకీయ, ఆర్థికంగా వెనుకబడిన ఎరుకల కులస్తుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన ఎరుకల ఎంపవర్‌మెంట్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఎరుకల సంఘం (టీవైఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు ప్రభుత్వాన్ని కోరారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పందుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న 50వేల ఎరుకల కుటుంబాల కోసం గత ప్రభుత్వం ఎరుకల ఎంపవర్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి రూ. 60 కోట్ల నిధులు కేటాయించిందని అన్నారు. ఆ పథకాన్ని నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

ప్రతీ మండల పందుల సొసైటీలకు 5 ఎకరాల ప్రభుత్వ భూములు కేటాయించాలని, రాష్ట్రంలో ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఎరుకల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినే నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేద ఆదివాసీ ఎరుకల కుటుంబాలను గుర్తించి బ్యాంకులతో సంబంధం లేకుండా ఎస్టీ కార్పొరేషన్ ద్వారా 100శాతం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు లోకిని సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్, రాష్ట్ర, జిల్లా నాయకులు కేతిరి రాజశేఖర్, కోనేటి రాజు, బూనాద్రి రంజిత్, ఓని సదానందం, పల్లకొండ ప్రభాకర్, బిజిలి ప్రశాంత్, లోకిని చందర్, మానుపాటి సురేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న లోకిని రాజు



ఆంధ్రజ్యోతి HANUMAKONDA RURAL
ఆదివారం 21 జనవరి 2024
హనుమకొండ రూరల్
• పరకాల • నడికూడ • ఆత్మకూరు • దామెర • శాయంపేట • ఎల్కతుర్తి • భీమదేవరపల్లి • కమలాపూర్

దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే రేవూరి

పరకాల, జనవరి 20: మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలోని దర్గా (ఉర్సు) ఉత్సవాల్లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శనివారం పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం మొదటిసారగా దర్గాకు విచ్చేసిన ఎమ్మెల్యేకు దర్గా పీఠాధిపతులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా సర్వమత సన్నిధిగా పేరొందిన దర్గాను భక్తులుఅధిక సంఖ్యలో హాజరై దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పదేళ్ల పాలనలో ఇంకా సమస్యలా..!

• రాష్ట్ర ఖజానాను పూర్తిగా ఖాళీ చేశారు.. • రాజకీయాలకు అతీతంగా అన్ని రంగాలను అభివృద్ధి చేస్తా.. • రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



ఎల్కతుర్తిలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఎల్కతుర్తి, జనవరి 20: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని పనులు పూర్తి చేశామని గొప్పలు చెప్పుకున్నారు. రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారు. గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో రూ. 25 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని శనివారంమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో ఆస్తులు అమ్ముకుని చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతూ ఆవేదనలో ఈ నెలతో పదవీ కాలాన్ని ముగించుకుంటున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారాలను ఇవ్వబోతున్నామని సూచించారు. ప్రభుత్వాలు వచ్చి పోతున్నప్పటికి ప్రభుత్వంలో పనిచేసే వ్యక్తుల మారుతారని జడ్పీ చైర్మన్ అన్న మాటలకు మంత్రి స్పందించారు. మనుషులు మారినా వారి పనితీరు ఎల్లకాలం ఉంటుందని చేసిన అవాకులకు చురకలంటించారు. ప్రభుత్వం కొలువు దీరిన రెండు నెలల్లోనే రెండు గ్యారెంటీలను అమలు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో ప్రజా పాలనలో ఆరు గ్యారెంటీలపై లబ్ధిదారుల నుంచి 1.5 కోట్ల దరఖా స్తులను తీసుకుని డాటా ఎంట్రీ చేయడం పూర్తయిందన్నారు. ఇప్పటి వరకు 9 కోట్లకు పైగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో జీరో టికెట్‌పై ప్రయాణాలు సాగించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని నెరువేరుస్తామని భరోసా ఇచ్చారు. ఎండాకాలం దృష్టిలో పెట్టుకుని మంచి నీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నియోజకవర్గ స్థాయిలో 305 హ్యాబిటేషన్లలో నీరు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఏడాది కాలంలో ప్రతీ గ్రామానికి మంచి నీటిశుద్ధి వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయించి వాటిని గ్రామ పంచాయతీలకు అప్పగిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిని కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వ ఖజానాలో నిధుల కొరత ఉందని సూచించారు. గ్రామ పంచాయతీలను ఆదర్శ గ్రామాలుగా తప్పక తీర్చి దిద్దుతామన్నారు. అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పిన నాయకులు ఇప్పటి వరకు మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయానికి భవనం ఏర్పాటు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ఎల్కతుర్తి మండల కేంద్రాన్ని నియోజక వర్గానికి ముఖ ద్వారంగా అభివృద్ధి చేస్తానని హామి ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను సరిష్కరించి మౌళిక సదుపాయాలను కల్పించడానికి ఏర్పాటు ముమ్మరం చేస్తామన్నారు. హుస్నాబాద్ నియోజక అభివృద్ధి అంటే పొన్నం చేశాడు అనే విధంగా తీర్చి దిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, ఎంపీపీ మేకల స్వప్న, ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, సర్పంచ్ కొమ్మిడి నిరంజన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూర్గుల రామారావు, తహసీల్దార్ జగత్‌సింగ్, ఎంపీడీవో సునీత, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, పీసీసీ సభ్యుడు బొమ్మనపెల్లి అశోక్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మహిళలకు పెద్ద పీఠ వేస్తున్న ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీఠ వేస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించిన అనంతరం ఐకేపీ మహిళా సంఘాల నాయకురాళ్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి మాట్లాడారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే ఆరు గ్యారేంటీలను అమలు చేస్తున్నామన్నారు. ఐకేపీ భవనానికి కాం పౌండ్ వాల్ నిర్మించాలని మంత్రిని మహిళలు కోరారు. తప్పక నిధులు కేటాయిస్తానని హామి ఇచ్చారు. నియోజకస్థాయిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి వారిలో ఉత్సహం నింపుతానన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రవీందర్, మహిళా సంఘాల సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

తమ్మీ.. గరం చాయ్ బాగుంది..

ముల్కనూర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, జనవరి 20: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌ను అభివృద్ధితో ముఖ చిత్రాన్ని మారుస్తానని రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం రాత్రి మంత్రి పొన్నం ఎల్కతుర్తి నుంచి హుస్నాబాద్‌కు వెళ్తూ మార్గ మధ్యలోనే ముల్కనూర్‌లోని సురేష్ హోటల్‌లో గరం చాయ్ తాగారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు, నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సెల్ఫీలు తిగారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తమ్ముడు గరం చాయ్ బాగుం దని, చాయ్‌వాలా సురేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్ ముఖర్జీ, కొత్తకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, నాయకులు కేతిరి లక్ష్మారెడ్డి, ఆదరి రవీందర్, కొల్గూరి రాజు, సుదర్శన్‌రెడ్డి, గుడికందుల శంకరయ్య, మాడ్గుల చింటూ, గుడికందుల రాజు, శ్రీరామోజు సమ్మయ్య మాడ్గుల గోపి పాల్గొన్నారు.



ముల్కనూరులో చాయ్ తాగుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నూతన భవనంలో సేవలు

పరకాల, జనవరి 20: పరకాల పట్టణంలోని వెల్లంపల్లి రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మించిన పురపాలక సంఘం కార్యాలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి సేవలు అందించడం జరుగుతుందని పరకాల కమిషనర్ శేషు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన భవనంలో పట్టణ ప్రజలకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అందుబాటులో ఉంటూ కార్యకలాపాలు నిర్వహించడం జరుగు తుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతాన్ని పెంచాలి

దామెర, జనవరి 20: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతాన్ని పెంచాలని సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి తెలిపారు. శనివారం దామెర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం లకావత్ రాజేష్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ గోనెల సురేష్‌ల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా సర్పంచ్ శ్రీరాంరెడ్డి హాజర య్యారు. ఇందులో భాగంగా ఈ నెల 24న జరుగనున్న జాతీయ బాలిక దినోత్సవం నిర్వహణపై చర్చించారు. బాల్య వివాహాలు, లింగ సున్నితత్వం, సమానత్వం వంటి అంశాలపై సమీక్షించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో నూతన పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)ని ఎన్నుకునేందుకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పీఏసీఎస్ డైరెక్టర్ రతన్, సీఆర్‌పీ రాజు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పరకాల, జనవరి 20: పరకాల పట్టణ మునిసిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన ఒంటేరు సారమ్మ, కోయిల సుమలత, మాదాసి భార్గవిల పార్థివ దేహాలకు శనివారం కాంగ్రెస్ పట్టణ కమిటీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యాడ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఒంటేరు శ్రావణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంద నాగరాజు, మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి, జిల్లా సేవదళ్ ఇంటేరు చందర్, ఎస్సీసెల్ అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, సీనియర్ నాయకులు గోపినాథ్, బుర్ర రాజమౌళి, బొచ్చు కట్టయ్య, బొచ్చు బాబు, చంగల్, గూడెల్లి సదన్ కుమార్, ఒంటేరు రవికుమార్, గొట్టె రమేశ్, బొచ్చు అనంత్, సంపత్, బిక్షపతి పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై కాషాయ జెండా ఎగరాలి

పరకాల, జనవరి 20:ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పరకాల పట్టణ 21వ వార్డు కౌన్సిలర్ ఆర్‌పి. జయంత్ లాల్ తనవంతు రామ కార్యంగా వార్డులోని ప్రతి ఇంటిపై కాషాయ జెండా ఎగురవేయాలనే ఆలోచనతో ప్రతీ కుటుంబానికి ఒక ధ్వజంతో పాటు దీపావళి కాకర పుల్లల వితరణ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. అయోధ్యలో నిర్మించిన రామమందిరం బలరాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా ఈ నెల 22వ తేదీన ప్రతి ఒక్కరూ ఇంటిపై కాషాయ జెండా ఎగురవేయాలని ప్రధాని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా 1116 ధ్వజాలు ఉచితంగా ఆర్‌పి.జయంత్ లాల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మరాటి నరసింహారావు, వెలిశెట్టి రాజేష్, పాలకుర్తి తిరుపతి, మెండు రాజశేఖర్, సూర్య రాహుల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కాషాయ జెండా లను పంపిణీ చేస్తున్న వార్డు కౌన్సిలర్ ఆర్‌పి.జయంత్‌లాల్

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

కమలాపూర్, జనవరి 20: కమలాపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన రౌడీ షీటర్లకు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి శనివారం సెంట్రల్ జోన్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 12 మంది రౌడీషీటర్లను డీసీపీ తన కార్యాలయానికి పిలిపించుకొని కౌన్సిలింగ్ చేశారు. సత్ప్రవర్తన కల్గిన సందెసాని సాంబయ్య, బోళ్ల సంపత్‌లపై ఉన్న రౌడీ షీట్లను ఎత్తివేశారు. గ్రామాలలో ఎలాంటి అసాంఘిక సంఘటనలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కమలాపూర్ పోలీసు ఇన్‌స్పెక్టర్ బొలిమల్ల సంజీవ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న డీసీపీ బారీ

జెండా గద్దెను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

దామెర, జనవరి 20:దామెర మండలం పసరుగొండ గ్రామంలో బీజేపీ జెండా గద్దెను కూల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ మంద రమేష్ కోరారు. ఇందులో భాగంగా శనివారం మంద రమేష్ మాట్లాడుతూ పసరుగొండ గ్రామంలో పోచమ్మగుడి సమీపంలో ఉన్న బీజేపీ జెండా గద్దెను కూల్చిన వారిని గుర్తించాలని, సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు పాల్పడడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. పసరుగొండ గ్రామంలో గతంలో ఎన్నడూ లేని విధంగా జెండా గద్దెలను కూల్చడం పట్ల తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ శ్రేణులు ఉన్నారు.



కూల్చిన గద్దె ఇదే

సమగ్రాభివృద్ధికి సమష్టి కృషి అవసరం



మాట్లాడుతున్న సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి

దామెర, జనవరి 20: దామెర సమగ్రాభివృద్ధికి సమష్టి కృషి ఎంతో అవసరమని సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి తెలిపారు. శనివారం దామెర గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీరాంరెడ్డి మాట్లాడుతూ గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే గ్రామ ప్రజలు సహకరించాలని సూచించారు. అంతే కాకుండా వంద శాతం పన్నులను చెల్లించాలని పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నిధుల వినియోగంపై చర్చించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ హింగె నాగేశ్వర్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్ మాదారపు రతన్, జీపీ సెక్రటరీ ఇంజపెల్లి నరేష్, ఏపీఎం ఝాన్సీ, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

• సొంతిల్లు లేక శ్మశానవాటిక ఎదురుగా మృతదేహం
• ఆర్థికసాయం అందజేసిన పలువురు



మృతుడి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

కమలాపూర్, జనవరి 20: కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన గాజుల రాజేందర్ (50) అనే వ్యక్తి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందారని గ్రామస్తులు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజేందర్ గత 30 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటూ స్వగ్రామంలో ఓ టీ కొట్టు పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నాడని తెలిపారు. ఇటీవల రాజేందర్ అనారోగ్యానికి గురికావడంతో హనుమ కొండలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. రాజేందర్‌కు స్వంత ఇల్లు లేకపోవడంతో కుటుంబ సభ్యులు మృతదేహన్ని తీసుకొచ్చి శ్మశాన వాటిక ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఉంచి కుటుంబ సభ్యులు, బంధువులు చందాలు వేసుకొని అంత్య క్రియలు నిర్వహించారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా గ్రామ పద్మశాలి కుల సంఘం నాయకులు బొప్ప శివశంకర్, బైరి దశరథం, పులికంటి రాజేందర్, రాజు, సహదేవ్‌లు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియలకు రూ. 11 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పేదవారైన రాజేందర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

రెడ్‌క్రాస్ సేవలను వినియోగించుకోవాలి

దామెర, జనవరి 20: గ్రామీణ ప్రాంతాల్లోని వయోవృద్ధులైన వారికి రెడ్‌క్రాస్ సొసైటీ అధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దామెర సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి సూచించారు. ఇందులో భాగంగా శనివారం దామెర మండల కేంద్రంలో ని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురిజాల శ్రీరాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, లాంఛనంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ మొబైల్ మెడికేర్ యూనిట్ హనుమకొండ ద్వారా వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో వృద్ధులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందచేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ డాక్టర్లు డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, డాక్టర్ మసూద్, రెడ్‌క్రాస్ సిబ్బంది శివకుమార్, గంగాధర్, అనిల్, రమేష్, పోశాలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, జనవరి 20: కాజీపేట మండలం కడిపికొండ ప్రాంతంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి చేరేందుకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8 తరగతులకు సంబంధించి ప్రవేశాలు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. 5వ తరగతిలో ఉన్న 80 సీట్లకు ఎస్సీ 5, బీసీ 10, ఎస్టీ 3, ఓసీ 2 సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. మిగిలిన సీట్లన్ని మైనారిటీ విద్యార్థులకు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 9 లోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

దేశానికి బలమైన నాయకుడు మోదీ

• గత ప్రభుత్వ నిర్ణయాలతో రాష్ట్రానికి నష్టం • మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయరామారావు

శాయంపేట, జనవరి 20:దేశానికి బలమైన నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ అని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయరామారావు అభిప్రాయపడ్డారు. మండలంలోని పత్తిపాక గ్రామంలో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో గత రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సఖ్యత లేకపోవడం మూలంగానే రాష్ట్రం ఆర్థికంగా నష్టపోయిందని అన్నారు. ఇళ్ల నిర్మాణానికి కేంద్రం భారీగా నిధులిస్తే పేదలకు ఇళ్లు నిర్మించకుండా నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. కేంద్ర పథకాలను రాష్ట్ర పథకాలనీ చెప్పుకున్నప్పటికీ అమలు చేయడంల విఫలమయ్యారని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేసుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే స్వాగతిస్తామన్నారు. రాబోవు ఎన్నికల్లో దేశ రక్షణకు పాటుపడే నరేంద్ర మోదీని ఎన్నుకోవాలని కోరారు. అలాగే కేంద్ర పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా అధికారులు సహకరించి సమర్ధవంతంగా పని చేయాలన్నారు. అనంతరం స్థానిక హనుమాన్ దేవాలయాన్ని శుభ్రం చేశారు. వివిధ శాఖల అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజలకు అందించే సేవలను తెలిపారు. డ్రోన్ స్ప్రేయర్ ద్వారా పిచికారి విధానాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీటీసీ గజ్జి ఐలయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ చక్రాధర్, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



డ్రోన్ స్ప్రేయర్ పిచికారీని యంత్రాన్ని పరిశీలిస్తున్న విజయరామారావు

ఉపాధ్యాయుల కరువు భత్యం వెంటనే విడుదల చేయాలి

-టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు



టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పెండెం రాజు, తదితరులు

దామెర, జనవరి 20: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు విడుతల కరువు భత్యం వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా శనివారం దామెర మండలం ఒగ్లాపూర్‌లోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోని ఎంజేపీ గురుకుల పాఠశాల వద్ద టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్-2024ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెండెం రాజు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న బిల్లులను సత్వరమే క్లియర్ చేయాలని, కరువు భత్యాన్ని మంజూరు చేయాలని తెలిపారు. అంతే కాకుండా ఎంజేపీ గురుకుల పాఠశాలల్లోని పని వేళలు మార్చాలని, గురుకుల పాఠశాలల్లో కేర్ టేకర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు సృజన, జగన్ పాల్గొన్నారు.

మత రాజకీయాలను తిప్పికొట్టాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

హనుమకొండ క్రైం, జనవరి 20: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, బీజేపీ ప్రభుత్వ మత రాజకీయాలను తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ హాజరై మాట్లాడారు. ఫిబ్రవరి 16న అఖిల భారత గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున మద్దతు పలికి సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంలో విఫలమైందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాద శక్తులను ఉసిగొలిపి హత్యారాజకీయాలకు పాల్పడుతోందని అన్నారు. ఇంకా అయోధ్య రామమందిరాన్ని తెర పైకి తెస్తూ రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రజల్లో చైతన్యం తేవడం కోసం దేశంలో అన్ని జాతీయ కార్మిక సంఘాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, జిల్లా నాయకులు రాములు, చుక్కయ్య ప్రభాకర్‌రెడ్డి, మెట్టు రవి, చక్రపాణి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

కేయూ వైస్ చాన్స్‌లర్ తాటికొండ రమేష్

భీమదేవరపల్లి, జనవరి 20: విద్యార్థులు జీవితాన్ని సవాల్‌గా తీసుకొని అంచలంచెలుగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ తాటికొండ రమేష్ అన్నారు. మండలంలోని ముల్కనూర్‌లో శనివారం స్వామి రామానంద తీర్థ సహకార జూనియర్ కళాశాల 35వ వార్షికోత్సవాన్ని ఎమ్మెల్సీ సురభి వాణీదేవితో కలిసి వైస్ చాన్స్‌లర్ తాటికొండ రమేష్ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వీసీ రమేష్ మాట్లాడుతూ స్వామి రామానంద తీర్థ కన్న కళలను సహకారం చేయాలన్నారు. అదేవిధంగా భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావును ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందుకెళ్లాలన్నారు. ఈ కళాశాల ప్రశాంత, ఆహ్లాదకరమైన వాతావరణలో కొనసాగుతుందన్నారు. భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు కూతురు సురభి వాణి దేవి నిర్వహిస్తున్న కళాశాలలో విద్యార్థులు చదవడం అదృష్టంగా భావించాలన్నారు. విద్యాసంస్థల్లో అమ్మాయిల సంఖ్యనే అధికంగా ఉంటుందన్నారు. విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సుచించారు. ఉపాధ్యాయులకు సన్నిహితంగా ఉండి అన్ని రకాల సమస్యలను పరిష్కరించుకొని దృఢ సంకల్పంతో ముందుకెళ్లాలన్నారు. అమ్మాయిలు విద్యావంతులైతే మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ సురభి వాణిదేవి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పుట్టి పెరిగిన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు విద్య వల్లనే దేశానికి ప్రధానమంత్రి అయ్యారని గుర్తు చేశారు. తన తండ్రి బాటలోనే తాను విద్యను నమ్ముతూ విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్నానన్నారు. తన స్వగ్రామంలోని వంగరలో 800ఎకరాల భూమిని తన తండ్రి దానం చేశారని గుర్తు చేశారు. స్వామి రామానంద తీర్థ బాటలో పీవీ నర్సింహారావు నడిచారని, పీవీ నర్సింహారావు చూపిన బాటలో నేను నడుస్తున్నానన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా శాస్త్ర సాంకేతిక విద్యను విద్యార్థులు ఎప్పటికప్పుడు అందిపుచ్చు కోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎదులాపురం మొగిలి, డాక్టర్ ఎదులాపురం తిరుపతి, రాంబాబు, ఏసీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ తిరుమలా ఋషి, చార్టెడ్ అకౌంటెంట్ హుస్సేన్ బాష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ తాటికొండ రమేష్